# క్లోజ్‌ఫ్రెండు

"జీవితం బుడగలాంటిది. పగిలేది ఏ క్షణమో ఎవరికీ తెలియదు. అయినా దగా, వంచన, మోసం ఎందుకో మనిషికీ తపన" దేవాలయ గోపురానికున్న మైకు నుండి మాటలు వినిపిస్తున్నాయి. నవ్వుకుంటూ ముందుకు వెళ్లాడు నాగరాజు.

'వి.శివనాగేశ్వరరావు, డ్రైవర్' గోడకు తగిలించిన నేమ్ ప్లేట్‌లో పేరు స్పష్టంగా కనిపిస్తోంది. ఆగాడు నాగరాజు. తన చేతిలోని కాగితాన్ని గోడకున్న నేమ్ ప్లేట్‌ను మార్చి మార్చి చూశాడు. తనకు కావలసిన అడ్రసు ఇదే.

'కుక్కలున్నాయి జాగ్రత్త'లాంటి బోర్డులేవీ కనిపించలేదు. గేటు తీసి ధైర్యంగా లోపలికి వెళ్ళాడు నాగరాజు. కాలింగ్ బెల్ నొక్కాడు. నుదుట పావలా బిళ్లంత కుంకుమబొట్టు, చేతినిండా గాజులు, కాళ్లకు కడియాలు, మెట్టెలతో హుందాగా బయటకొచ్చింది ఒక స్త్రీ. ఆమెకు దాదాపు నలభైయేళ్లుంటాయి.

"నమస్కారం అక్కయ్యగారూ! నేను ఆదోని డిపో ఆర్.టి.సి. బస్ కండక్టరునండి. నా పేరు నాగరాజు. మీ ఆయన నాగేశ్వరరావు నేను చాలా క్లోజ్ ఫ్రెండ్స్‌మండి. ఈరోజు డ్యూటీ లేదు. ఇంటి దగ్గరే వుంటాను రమ్మని ఫోన్ చేశాడు. అందుకే వచ్చాను" అన్నాడు నాగరాజు.


"నైట్ విజయవాడ బస్సుకు వెళ్లాలి. రెండ్రోజుల వరకు రానంటూ సాయంకాలమే వెళ్లారు. మీరు వస్తున్నట్లుగా నాతో చెప్పనేలేదు" అంటూ అనుమానంగా చూడసాగింది నాగేశ్వరరావు భార్య అలివేలమ్మ.

"చవకగా ఏదైనా ప్లాటు వుంటే చెప్పరా అని ఆమధ్య కలిసినపుడు చెప్పాడు. ఆ విషయం మాట్లాడాలనే రమ్మన్నాడు. నేను వస్తున్న బస్ చెడిపోయింది. బస్సులు మారి రావడంతో ఆలస్యమైంది. ఇప్పుడేం చేయాలబ్బా" నిరాశగా పలికాడు నాగరాజు.

గుట్టుచప్పుడు కాకుండా కార్యం నెరవేర్చుకోవాలన్నది అలివేలమ్మ నైజం 'ప్లాటు కొనాలని అనుకుంటున్నట్లుగా ఎప్పుడో చెప్పాడాయన. ఈయనేమో ప్లాటు విషయం అంటున్నాడు. ఈ సంగతి అందరికీ తెలిస్తే బాగోదు' అనుకుంది. "రండి అన్నయ్యా! లోపల కూర్చుని మాట్లాడుకుందాం" ఆప్యాయత కనబరుస్తూ ఇంట్లోకి పిలిచింది.

కాఫీ కప్పు చేతికిచ్చింది. "చెప్పండి అన్నయ్యగారూ! ఆయన లేకపోయినా వచ్చిన తర్వాత ఆయనతో అన్ని విషయాలు నేను చెప్తాగా" ఆతృతతో పలికింది అలివేలమ్మ.

"ఆదోనిలో బస్టాండుకు దగ్గరలోనే నాకు తెలిసిన ఒకాయన ప్లాటు అమ్మాలనుకుంటున్నాడు. ఐదు సెంట్లు ఉందన్నాడు. ఇప్పుడు అక్కడ సెంటు స్థలం యాభైవేలకు తక్కువ దొరకదు. నాకు బాగా తెలిసిన వాడు, పైగా డబ్బు ఇబ్బందిలో వున్నాడు. అంచేత ముప్పయి వేలకే యిస్తానన్నాడు. నేనే కొందామనుకున్నాను. కానీ అంత డబ్బు నేను సర్దలేను. అదీగాకుండా మన శివం, అదే మీ ఆయన ప్లాటు కొనాలని చెప్పాడు. అందువల్ల విషయం చెప్పాలని వచ్చాను. మొత్తం స్థలం



మీరే కొంటే సరే, లేదంటారా ఇద్దరం కలిసి తీసుకోవచ్చు. ఆలస్యం చేస్తే వేరెవరయినా పోటీకి రావచ్చు. అతని మనసు మారవచ్చు. అందుకే ఇలా అర్జంటుగా పరుగెత్తుకొచ్చాను" చెప్పాడు నాగరాజు.

'వంట గది, దేవుని గది కాకుండా ప్రత్యేకంగా బెడ్‌రూం, అతిథులెవరైనా వస్తే గెస్ట్‌రూం, కామన్‌హాల్, ఇంటి ముందు గార్డెన్‌లాంటివి పెంచుకునేందుకు వీలుగా స్థలం వదలాలి. అబ్బ ఎంత అందమైన ఇల్లో. చూసే వాళ్ల కళ్లు చెదిరిపోవాలి' అప్పుడే ప్లాట్ కొన్నట్లు, ఇల్లు కట్టుకున్నట్లు ఊహల్లో తేలిపోసాగింది అలివేలమ్మ.

"అక్కయ్యగారూ! ఏదో ఊహల్లో విహరిస్తున్నట్లున్నారు" నాగరాజు మాటలతో వులిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది అలివేలమ్మ.

"అబ్బే ఏం లేదన్నయ్యా ఆ ప్లాటు మేం తప్పకుండా కొంటాం. మీరు వెంటనే స్థలం ఓనరుతో కలిసి మాట్లాడి వేరే వాళ్లకు అమ్మకుండా చూడాలి. ఆయన వచ్చిన వెంటనే మేమిద్దరం ఆదోనికి వస్తాము. ఈ సాయంచేయండి. మీ మేలు మరచిపోలేను" అంది.

"ఈమాత్రం దానికి ఇంతగా చెప్పాలా అక్కయ్యా! మిత్రుడన్నాక ఆమాత్రం చేయలేనా. ఇక ఆ ప్లాటు మీది. మరి నే వెళ్లొస్తానండి. అన్నట్టు మీకోసం తెచ్చిన పండ్లు స్వీట్స్ సంచిలోనే వుండిపోయాయి. మాటల్లో పడి మరిచేపోయాను. తీసుకోండి" అంటూ బ్యాగ్‌లో నుండి స్వీట్స్ పాకెట్, యాపిల్ పండ్లు అలివేలమ్మ చేతికిచ్చాడు నాగరాజు.

"ఇవన్నీ ఎందుకన్నయ్యా!" అంటూనే అన్నీ అందుకుంది అలివేలమ్మ. "నా మతిమరపుమండా. భోంచేసి వెళ్లుదురుగానీ, కొంచెంసేపు వుండండి. ఏ అర్థరాత్రైనా ఆదోనికి వెళ్లొచ్చు. ఎప్పుడైనా బస్సులుంటాయి. భోజనం కూడా పెట్టకుండా పంపానని తెలిస్తే మీ ఫ్రెండ్ నన్ను తిట్టిపొయ్యడా" బలవంతం చేసింది అలివేలమ్మ.

"మీరు మరీ ఇబ్బంది పెట్టేస్తున్నారక్కయ్యా. సరే మీ మాట ఎందుకు కాదనాలి. భోజనం చేసే వెడతాను" అన్నాడు నాగరాజు.

"వంట పూర్తయ్యేంతవరకు ఈ స్వీట్ తింటూ టీవీ చూస్తుండండి. నేను తెచ్చిన స్వీట్ నాకే ఇస్తుందేమిటా అని మాత్రం అనుకోవద్దండి" ఒక ప్లేటులో స్వీటు, కార నాగరాజు ముందుంచింది అలివేలమ్మ.

"మీరు మరీ గమ్మత్తుగా మాట్లాడతారక్కయ్యా. నాకు మాత్రం స్వీట్ ఇస్తూ మీరు వూరికే వుండడం భావ్యం కాదండి. మీరు కూడా స్వీట్ తీసుకోండి" అన్నాడు నాగరాజు.

కబుర్లు చెబుతూ స్వీట్స్ తిని టీ తాగారు.

"భోజనం ఏర్పాట్లు చేస్తాను అన్నయ్యగారూ" అంటూ లేవబోతే కొద్దిగా కళ్లకు మైకం కమ్మినట్లయింది.

"ఏమైందక్కయ్యగారూ" అడిగాడు నాగరాజు.

"అబ్బే ఏం లేదండి. ఏదో కొద్దిగా తల తిరిగినట్లుంటేను" ఇక మాట్లాడలేకపోయింది అలివేలమ్మ. పక్కనున్న సోఫాలోకి ఒరిగిపోయింది.

* * *

మెల్లగా కళ్లు తెరిచింది అలివేలమ్మ. ఇంట్లో లైట్లన్నీ వెలుగుతున్నాయి. మెల్లగా లేచి కూర్చుంది. జరిగిన విషయమంతా గుర్తొచ్చింది. స్వీట్స్ తినేంతవరకూ జ్ఞాపకముంది. తర్వాత ఏమయిందో తెలియదు. ఇంతకూ తనతో మాట్లాడిన మనిషి ఏమైనట్లు భయంతో వణికిపోయింది. బెడ్‌రూంలోకి వెళ్లింది. బీరువా బార్లా తెరిచి వుంది. పైన వుండాల్సిన సూట్‌కేసులు కిందపడి

వున్నాయి. కుప్పకూలిపోయింది అలివేలమ్మ.

అలివేలమ్మ పెళ్లయి కాపురానికొచ్చినపుడు ఇంకా అపుడే కొత్తగా ఉద్యోగంలో చేరాడు శివనాగేశ్వరరావు. భార్య మాటకు ఎదురు చెప్పేవాడు కాదు. భర్తకు తెలియకుండా పదో పరకో మిగిలించి ఇరుగు పొరుగువారికి అప్పులిచ్చి ఖచ్చితంగా వసూలు చేసేది. భర్త డ్యూటీకి పోయాడంటే సరిగా అన్నం కూడా వండేది కాదు. ఉన్న దాంతో సర్దుకుపోయేది . ఒక కూతురు పుట్టగానే భర్త వద్దంటున్నా వినకుండా ఆపరేషన్ చేయించుకుంది అలివేలమ్మ. ఆ ఒక్క కూతురిని గవర్నమెంటు హాస్టలులో చేర్పించింది. తినీ తినక ఇరవైయేళ్లనుండి దాచినదంతా హుష్‌కాకి. రాత్రంతా కంటి మీద కునుకే లేకుండా గడిపింది. ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూడసాగింది.

ఐదు గంటలకే తలుపు తీసింది. ఇంకా నిద్రమత్తులో తూగుతున్న ఇరుగుపొరుగు వారందరినీ లేపింది. అందరిముందు తన గోడు వెళ్లబోసుకుంది.

'అన్నిట్లోను అతిగుట్టు పనికిరాదమ్మా. ఇప్పుడేం జరిగిందో చూశావుగదా. అయినా ఇప్పుడేం చేస్తాం తెల్లవారనీ, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రిపోర్టిద్దాం. అంతకంటే ఏం చేయగలం' అన్నారందరూ.

పోలీస్ రిపోర్టు ఇచ్చి భర్తకోసం ఎదురు చూడసాగింది అలివేలమ్మ. రెండ్రోజుల తర్వాత ఇంటికి వచ్చాడు శివనాగేశ్వరరావు. విషయం విని అవాక్కయ్యాడు. భార్యతో కలిసి ఎస్.ఐను వెంటబెట్టుకొని ఆదోనికి వెళ్లాడు. ఉన్న కండక్టర్లు, డ్రైవర్లు అందరిని చూసింది అలివేలమ్మ. అసలు నాగరాజు పేరుతో కండక్టరు ఎవరూ లేరని తేలింది. ముఖం వేలాడేసుకుని వెనుదిరిగి వచ్చారు."మా ప్రయత్నం మేం చేస్తామండి. ఆపై మీ అదృష్టం'' అన్నాడు సబ్ ఇన్‌స్పెక్టర్.

"మనం మాట్లాడుకునే విషయాలు విని, మన అడ్రస్‌లు తెలుసుకుని, మన ఇంటికి వచ్చి, మనల్ని నట్టేట ముంచే నాగరాజులాంటి క్లోజ్ ఫ్రెండ్స్‌ను ఎప్పటికీ మరచి పోలేం. ఇంతవరకు పోయిన సొమ్ము దొరకలేదు. ఇంత మోసం చేసిన ఆ క్లోజ్‌ఫ్రెండ్ ఎవరో అంతుచిక్కలేదు" గొణుక్కుంటూ డ్యూటీకి బయలుదేరాడు శివనాగేశ్వర రావు.

**-టి.రామాంజనేయులు**
**(హాలహర్వి)**

# ఐడియా

సాయంత్రం ఐదవుతోంది.

వెళ్లేది యింటికే అయినా ఏదయినా టిఫిన్ తిని వెళ్దామనిపించి కనిపించిన హోటల్‌లో దూరాను. టిఫిన్‌కి ఆర్డరిచ్చి ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాను.

''హలో! బాగున్నారా?'' ఎవరో పలకరించినట్లయితే తలెత్తి చూశాను. ఎవరో ఓ పాతికేళ్ల యువతి. చిరునవ్వుతో నన్నే చూస్తూవుంది.

''హలో'' అన్నాను సందిగ్ధంగా.


''అదేంటండీ? నన్ను గుర్తుపట్ట లేదా? మీ ఫ్రెండ్ సుబ్బారావు చెల్లెల్ని. నా పేరు లీల! అవున్లెండి. మీరు మన ఊరు వదిలి ఓ పదేళ్లు అయివుంటుంది కదా! అప్పటికి మేము చిన్నవాళ్లం మీరు ఏమీ మారలేదు. కనుక నేను గుర్తుపట్టాను'' గలగలా మాట్లాడేస్తున్నదామె.

ఇంతలో సర్వర్ టిఫిన్ తెచ్చి నా ముందు పెట్టాడు. ఎదురుగా ఆమె వుండగా నేనొక్కణ్నే ఎలా తినటం? ఆమె ఎవరో, సుబ్బారావనే ఫ్రెండ్ నా చిన్నతనంలో నాకుండేవాడో లేదో, ఇదంతా నాకేం జ్ఞాపకం రావటం లేదు. కానీ కర్టెసీ అనేదొకటి ఏడ్చింది కదా! అందుకే సర్వర్‌ని ఆమెకి కూడా టిఫిన్ తెమ్మని చెప్పాను.

''అబ్బే! ఎందుకండీ, ఈ టైంలో టిఫిన్ తినే అలవాటు నాకు లేదు'' అందామె కాస్త సిగ్గుపడుతున్నట్టుగా. 'మరెందుకొచ్చినట్లిక్కడికి? ఏమో కాఫీకేమో' నాలో నేను అనుకుని సర్వర్ తెచ్చిన టిఫిన్ ప్లేటు ఆమె ముందుకు తోసి సర్వర్‌తో రెండు కాఫీ అని చెప్పి, తినటం మొదలుపెట్టాను. తప్పదన్నట్లుగా ఆమె కూడా తినటం మొదలుపెట్టింది. ఎంత గుర్తు చేసుకున్నా నాకు సుబ్బారావుగానీ అతని చెల్లెలుగానీ గుర్తురావటం లేదు. కానీ ఒక అమ్మాయి అనవసరంగా 'మీ ఫ్రెండ్ చెల్లెల్ని' అని ఎందుకు చెప్తుందీ అని ఒక అనుమానం. ఆలోచిస్తూనే కాఫీ త్రాగటం ముగించాను. సర్వర్ వచ్చి బిల్లిచ్చి వెళ్లాడు. ఆ అమ్మాయి చప్పున బిల్లు తను అందుకుని ''చాలారోజుల తర్వాత కలిశాం కదా! బిల్లు నేనిస్తాను'' అంటూ భుజానికి వెళ్లాడుతున్న బ్యాగ్ తెరిచి బిల్ పేచేసింది.

నాకు మాట్లాడే అవకాశం కూడా యివ్వకుండా తర్వాత గట్టిగా నవ్వి నా చెయ్యి పట్టుకుని ఊపేస్తూ ''థాంక్సండీ'' అంది.

నాక్కొంచం చిరాకనిపించింది. అయినా



తమాయించుకున్నాను. ఎందుకంటే రేపెప్పుడయినా ఆ సుబ్బారావెవరో నన్ను కలిస్తే, తన చెల్లెల్ని నేను విసుక్కున్నానని తెలిస్తే బాగుండదు కదా! అందుకే నన్ను నేను కంట్రోల్ చేసుకుని ''బిల్ మీరే పే చేశారు గదా! ఇంక థాంక్సెందుకు? చెప్తే గిప్తే నేనే గదా థాంక్స్ చెప్పాలి'' అన్నాను. ఎంత దాచుకున్నా నా మాటల్లో విసుగు కనిపించిందేమో ఆమె కొంచెం చిన్నబుచ్చుకుంది. మళ్లీ వెంటనే హుషారు తెచ్చుకుని ''నా పెళ్ళి ఆపేసినందుకు మీకు థాంక్స్ చెప్పాల్సిందేనండీ'' అని కిలకిలా నవ్వింది. నా చెయ్యి మాత్రం వదలలేదు.

నాకు మతిపోయినంత పనైంది. ఏమంటోందీ అమ్మాయి? అదే అడిగాను ఆశ్చర్యంగా.

''ఓహ్ సారీ సర్! మీకు అసలు సంగతి తెలియదు కదా! చెప్తాను వినండి. నేను మా క్లాస్‌మేట్‌ని ప్రేమించాను. మేమిద్దరం పెళ్లి కూడా చేసుకుందామని డిసైడయ్యాము. ఇంతలో మా పెద్దవాళ్లు నాకో పెళ్లిసంబంధం చూశారు. వాళ్లకి నా ప్రేమ విషయం చెప్పినా పెద్దగా పట్టించుకోరు. అందుకే డైరెక్ట్‌గా పెళ్లికొడుక్కే ఫోన్ చేసి ఈ హోటల్‌కి ఈ టైంకి రమ్మని చెప్పాను. చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలి అని చెప్పాను. అదిగో చూడండి ఆ చివర టేబుల్ దగ్గర కూర్చుని మనల్నే చూస్తున్నాడు. అతనే మా వాళ్లు చూసిన పెళ్లికుమారుడు. ఇప్పుడు మనిద్దరినీ యింత క్లోజ్‌గా చూశాక కూడా నన్ను పెళ్లి చేసుకుంటాననలేడు కదా! నాకది చాలు'' నా చెయ్యి ఊపేస్తూ మళ్లీ నవ్విందామె.

ఆమె చూపించిన వైపు చూసిన నేను స్థాణువైనాను. ఆమె చేతిలోంచి నా చెయ్యి గభాల్న వెనక్కి లాక్కున్నాను. ''మీకు చాలు సరే! మీకష్టం తీరింది. కానీ నాకిప్పుడే కష్టాలు మొదలయ్యాయి. అయినా హోటల్లో యింతమంది వుండగా మీ ప్రయోగానికి నేనే దొరికానా?'' అంటూ నీరసంగా కుర్చీలో కూలబడ్డాను.

''అహ అదికాదు. అందరిలోకి మీరు పెద్దమనిషిలా కనబడితేనూ. తర్వాత దీనివలన నాకే యిబ్బందీ రాకూడదు కదా! అందుకనే మిమ్మల్ని ఎంచుకున్నాను. అయినా మీరలా ఎందుకంటున్నారు? ఎనీథింగ్ రాంగ్?'' ఆత్రుతగా అడిగిందామె.

''యెస్! ఎవ్రీథింగ్ రాంగ్! అతనెవరనుకున్నారు? నా కాబోయే బావమరిది. ఇంకో వారం రోజుల్లో నా పెళ్లి జరగాల్సి వుంది. అఫ్‌కోర్స్! పెళ్లి ఆగకపోవచ్చు. కానీ తర్వాత నా కష్టాలు తల్చుకుంటేనే భయంగా వుంది'' అన్నాను.

**-సాధనాల నాగవర్ధని**
**(నూజివీడు)**